సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం : 27 : మే : 2023



..అండగా తపాలా శాఖ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించేందుకు తపాలా శాఖ ముందుకొచ్చింది. 12లో



..తస్మాత్ జాగ్రత్త!

తల్లిదండ్రులు గొప్పలకు పోయి పిల్లలకు బైక్‌లు ఇచ్చి, వారి ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని పోలీసులు సూచిస్తున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అభిషేకం జరుపుతున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం జరిపారు. మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

ఐసెట్ పరీక్ష ప్రశాంతం



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం శుక్రవారం అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఐసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొదటి షిఫ్టులో 107 మందికి గాను 94 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 107 మందికి గాను 102 మంది హాజరయ్యారు. రెండు షిఫ్టుల్లో కలిపి 18 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: సాహస బాలల అవార్డు కోసం బాలబాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి (డీడబ్ల్యూఓ) సబిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న బాలలు అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి సాహసోపేతంగా వ్యవహరించి ప్రాణాలను రక్షించినవారు, నష్టాన్ని నివారించినవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. www. iccw.co.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను అక్టోబర్ 15లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

డీడీగా డేవిడ్‌రాజ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డేవిడ్ రాజ్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డీడీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా డేవిడ్ రాజ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు బదిలీపై వెళ్తున్న రమాదేవి నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలను స్వీకరించిన డేవిడ్ రాజ్‌ను కార్యాలయ పీఎంఆర్‌సీ అధికారులు, సిబ్బంది అభినందించారు. అభినందించిన వారిలో ఐటీడీఏ ఏఓ భీమ్, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నరసింహారావు, వమీల, రమణమూర్తి ఉన్నారు.

పోడు సెగ..



అశ్వారావుపేట రూరల్: వాగొడ్డుగూడెంలో అటవీ సిబ్బంది, పోడుసాగుదారులకు మధ్య వివాదం(ఫైల్)

పోడు భూములకు పట్టాల జారీకి రంగం సిద్ధం

- గిరిజనులకే పట్టాలు ఇస్తామంటున్న ప్రభుత్వం
- గిరిజనేతరుల చేతిలో 1.6 లక్షల ఎకరాల పోడు
- అందరికీ పట్టాలు ఇవ్వాలంటున్న రాజకీయ పక్షాలు
- పోడు రైతుల భరోసా పేరుతో నేడు పొంగులేటి ర్యాలీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పోడు పట్టాల వ్యవహారం జిల్లాలో క్రమంగా కాక రేపుతోంది. అర్హులైన గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తామంటూ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటి నుంచి ఈ అంశంపై ఆచీతూచి వ్యవహరిస్తూ వచ్చిన ప్రతిపక్షాలు క్రమంగా స్వరం పెంచుతున్నాయి. పోడు భూములు సాగు చేస్తున్న అందరికీ పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాటాలకు సిద్ధమవుతున్నాయి.

ఏళ్లుగా నలుగుతున్న సమస్య

తెలంగాణలో అత్యధికంగా అడవులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తరించి ఉన్నాయి. అదే స్థాయిలో ఇక్కడ లక్షలాది ఎకరాల అటవీ భూమిని నరికి సాగులోకి తెచ్చారు. గడిచిన పదేళ్లుగా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలనే అంశం ఇక్కడి ప్రజల జీవితాల్లో దైనందిన రాజకీయాల్లో కీలక అంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మణుగూరు పర్యటనలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ... మళ్లీ తమ ప్రభుత్వాన్నిగెలిపిస్తే దగ్గరుండి పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తానంటూ హామీ ఇచ్చారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో రెండోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత క్రమంలో పోడు భూములకు పట్టాల అంశం ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా దరఖాస్తులు, సర్వేలతో ఇంచుమించు నాలుగేళ్ల సమయం గడిచిపోయింది.



మారిన వ్యూహం

ప్రభుత్వ ఆదేశాలతో ఫారెస్టు అధికారులు చేపట్టిన సర్వేలో జిల్లా వ్యాప్తంగా 2.97 లక్షల ఎకరాల పోడు భూమి ఉన్నట్టు గుర్తించారు. ఈ భూమికి పట్టాలు జారీ చేయాలంటూ 83,341 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో గిరిజనులకు సంబంధించి 65,616 దరఖాస్తులు ఉండగా గిరిజనేతరులకు సంబంధించి 17,725 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. కొంత కాలం ఈ అంశాన్ని సర్కార్ పెండింగ్‌లో పెట్టింది. అనూహ్యంగా ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ అంశంపై కీలక ప్రకటన చేశారు 'నరక్కుంటూ పోతే అడవులు అంటూ ఉండవని చెబుతూ ప్రస్తుతం గిరిజనుల ఆధీనంలో ఉన్న పోడు భూములకు పట్టాలు జారీ చేస్తామని, అంతకంటే ముందు గ్రామ సభలు ఏర్పాటు చేసి మళ్లీ పోడు చేయమంటూ హామీ పత్రాలు తీసుకుంటామన్నారు. ఒక్కసారి పట్టాల జారీ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోడు విషయంలో కఠినంగా ఉంటామని, ఈ విషయంలో ఇతర రాజకీయ పార్టీలు సైతం తమకు సహకారం అందివ్వాలని, అడవులను రక్షించాలి' అంటూ ప్రసంగించారు.

గిరిజనులకే పట్టాలు

సీఎం ప్రకటన తర్వాత కొద్ది కాలానికే పట్టాల విషయంలో ఇటు ఫారెస్టు, రెవెన్యూ విభాగాలు చకచక ఫైళ్లు కదిలించాయి. చివరకు భద్రాద్రి జిల్లాకు సంబంధించి 44,041 గిరిజన కుటుంబాలకు 1,33,141 ఎకరాల పోడు పట్టాలకు రెడీ అయ్యాయి. గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న ఒక లక్షా అరవై నాలుగు ఎకరాల భూములకు పట్టాలు జారీ చేసే అంశం పెండింగ్‌లో పడింది. బడ్జెట్ సమావేశాల్లో సీఎం ప్రసంగం అనంతరం వివిధ రాజకీయ పక్షాలు స్పందిస్తూ పోడు సాగు చేస్తున్న రైతులందరికీ భూములు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాయి. లేని పక్షంలో ఈ సమస్య మళ్లీ మళ్లీ ఉత్పన్నం అవుతుందంటూ ప్రకటనలు జారీ చేస్తూ వచ్చాయి తప్పితే ఈ అంశంపై ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటించలేదు. ఇటీవల మీడియా సమావేశాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రంగంలోకి పొంగులేటి

జూన్ 24 నుంచి ప్రభుత్వం పోడు పట్టాలు ఇచ్చేందుకు షెడ్యూల్ సిద్ధం చేసింది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీపై తిరుగుబాటు చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పోడు పట్టాల అంశంపై ప్రత్యక్ష కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్రంలోనే పోడు భూముల సమస్య అధికంగా ఉన్న భద్రాద్రి జిల్లాలో పోడు రైతు భరోసా పేరుతో భారీ ర్యాలీకి శ్రీకారం చుట్టారు. శనివారం ఉదయం పది గంటలకు ఇల్లెందు క్రాస్‌రోడ్ నుంచి ర్యాలీని ప్రారంభించి కలెక్టరేట్ వరకు కొనసాగించనున్నారు. అక్కడ పోడు సాగులో ఉన్న రైతులందరికీ పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నారు. రాబోయే నెల రోజుల్లో పోడు పట్టాల అంశంపై గళం విప్పేందుకు ప్రతిపక్ష పార్టీలు రంగం సిద్ధం చేస్తున్నాయి. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రెడీ అవుతున్నాయి. మరో సమయంలో ఓ వైపు హరిత హారం, మరోవైపు పోడు పట్టాల అంశంలో ప్రజల మనసులు గెలుచుకోవడం బీఆర్‌ఎస్‌కు సవాల్‌గా మారింది.

విద్యుత్ బకాయి రూ.228 కోట్లు

మిషన్ భగీరథ నుంచే రూ.169 కోట్లు..



జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం

కొత్తగూడెంరూరల్: జిల్లా విద్యుత్ శాఖపై మొండి బకాయిల భారం పెరుగుతోంది. వివిధ ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన బిల్లులు రూ. కోట్లలో పేరుకుపోయాయి. పలు ప్రభుత్వ శాఖలు 228 కోట్ల రూపాయలు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు వసూళ్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మిషన్ భగీరథ రూ.169 కోట్లు, ఇరిగేషన్ శాఖ రూ.10 కోట్లు, వీధి దీపాలు, తాగునీటికి సంబంధించి పంచాయతీలు రూ.10 కోట్లు, విద్యాశాఖ రూ.4.19 కోట్లు, పోలీసు శాఖ రూ.4.70 కోట్లు, ఐటీడీఏ కోటి రూపాయల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. కిన్నెరసాని రిజర్వాయర్ నుంచి కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు తాగునీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ బిల్లు రూ.17.17 కోట్లు బకాయి ఉంది. ఇదికాకుండా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరులు రూ.1.17 కోట్ల విద్యుత్ బిల్లు చెల్లించాల్సి ఉంది. వైద్య, ఆరోగ్య శాఖ రూ.2.40 కోట్లు, పంచాయతీరాజ్ రూ.1.45 కోట్లు చెల్లించాల్సి ఉంది. మరికొన్ని శాఖలు కూడా విద్యుత్ శాఖకు బకాయి పడ్డాయి. బిల్లుల వసూళ్లలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా జిల్లాలో విద్యుత్ శాఖలో కొత్తగూడెం, భద్రాచలం రెండు డివిజన్లు ఉండగా, వీటి పరిధిలో కేటగిరీ–1లో 3,28,644 కనెక్షన్లు, కేటగిరీ–2 విభాగంలో 36,720 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన లబ్ధిదారులకు రూ. 5 వేలు. రూ. 10 వేలు బిల్లు దాటితే చాలు అధికారులు విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తారు. కానీ ప్రభుత్వ శాఖలు రూ. కోట్లలో బకాయి పడినా బిల్లులు వసూళ్లు చేయడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

దృష్టి సారిస్తాం



జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల పెండింగ్ విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి సారిస్తాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో విద్యుత్ కోత లేకుండా వేసవి కాలంలో విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

–రమేష్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ

ధాన్యం కోసం గోదాములు సిద్ధం

కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు జిల్లాలో భద్రాచలం, పాల్వంచ, టేకులపల్లి, దమ్మపేట మండలాల్లో ప్రత్యేక గోదాములు సిద్ధం చేసినట్లు కలెక్టర్ అనుదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా భద్రపరిచేందుకు నాలుగు తాత్కాలిక గోదాములను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అకాల వర్షాల వల్ల కొన్ని సమస్యలు వస్తున్నాయని రానున్న నాలుగైదు రోజుల్లో ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని తెలిపారు. ఎండ తీవ్రత వల్ల కాంటా వేసిన ధాన్యం బస్తాలను మిల్లుల వద్ద హమాలీలు అన్‌లోడ్ చేయలేకపోతున్నారని, దీంతో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో దిగుమతి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికాకుండా సంయమనం పాటించాలని సూచించారు.

కిన్నెరసానిని సందర్శించిన జడ్జి



బోటు షికారు చేస్తున్న జడ్జి కుటుంబం

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని శుక్రవారం హైదరాబాద్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్–3 జడ్జి ఎం .రాంగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. డీర్ పార్కులోని దుప్పులను, పర్యావరణ కేంద్ర భవనంలోని జంతువుల బొమ్మలను తిలకించారు. అనంతరం జలాశయంలో బోటు షికారు చేశారు. ఆయన వెంట వైల్డ్‌లైఫ్ రేంజర్ శ్రీనివాసరావు, బీట్ ఆఫీసర్ రవి ఉన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు పంపొద్దు

భద్రాచలం ప్రభుత్వాస్పత్రి వైద్యులకు పీఓ గౌతమ్ హెచ్చరిక



వైద్య సేవలపై ఆరా తీస్తున్న పీఓ గౌతమ్ పోట్రు

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో రోగులకు చికిత్స అందించాలని, బాధితులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపొద్దని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరియా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించారు. కాన్పుల విభాగాన్ని సందర్శించి గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ కిట్లు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లపై ఆరా తీశారు. ఎస్‌ఆర్‌టీసీ రక్తనిధి కేంద్రం, ఆపరేషన్ థియేటర్, రక్తపరీక్షల ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వం రోగుల కోసం ఖరీదైన మందులు సరఫరా చేస్తున్నప్పటికీ, ఆస్పత్రి ఎదుట మెడికల్ షాపులు ఎందుకు ఉన్నాయని, మన వద్ద అవసరమైన మందులు ఉన్నప్పటికీ బయట కొనాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయమై డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షించాలని ఆదేశించారు. రోగులు బయట మెడికల్ షాపులలో మందులు కొనకుండా చూడాలన్నారు. రక్తనిధి కేంద్రంలో రక్తం అందుబాటులో ఉంచాలని చెప్పారు. రక్త పరీక్షలకు, మందులకు రోగులను బయటకు పంపితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ రామకృష్ణ, వైద్యులను హెచ్చరించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ (రక్త పరీక్షల కేంద్రం) సేవలను రోజూ వినియోగించుకునేలా ప్రణాళికలు తయారు చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్ సందర్శించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, అధికారులు తానాజీ, కె.రాజకుమార్, డాక్టర్ చైతన్య, రాముడు, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ సంతోష్, నర్సింగ్, రామలక్ష్మి, పుష్ప, మాలతి, భవాని పాల్గొన్నారు.

డిప్యూటేషన్‌పై కసరత్తు

- విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రణాళిక
- ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత
- జిల్లాలో 696 ఉపాధ్యాయుల ఖాళీలు
- పదో తరగతి ఫలితాలు తగ్గడంతో ముందస్తుగా మేల్కొన్న విద్యాశాఖ



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు నుంచే పలు కార్యక్రమాలు చేపట్టేందుకు విద్యాశాఖాధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రారంభానికి ముందు రోజు వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయుల డిప్యూటేషన్లకు సంబంధించి ఆర్డర్స్‌కు కూడా అదే రోజు అందించి, మరోసటి రోజు కేటాయించిన పాఠశాలలో రిపోర్టు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం తగ్గింది. అందుకు గల లోపాలను అధిగమించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. మరోవైపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కూడా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ తప్పనిసరిగా మారింది. గతంలో మాదిరిగా యూనియన్ల పైరవీలు, ఒత్తిడి కారణంగా కొందరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ వేసినప్పటికీ ఆయా ప్రాంతాలకు వెళ్లలేదు. దీంతో సబ్జెక్టు టీచర్ల కొరత కారణంగా ఆయా సబ్జెక్టుల్లో బోధన కూడా జరగలేదు. ఈ కారణంతో కొందర విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. వచ్చే విద్యా సంవత్సరంలో అలాంటి పరిస్థితులు రాకుండా జిల్లా విద్యాధికారులు ముందస్తు ప్రణాళికలు చేస్తున్నారు. నిర్దేశిత ఫారం పంపి ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, ఖాళీలు, అవసరం వంటి వివరాలను హెచ్‌ఎంలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంల నుంచి సేకరిస్తున్నారు. వచ్చిన వివరాల ఆధారంగా ఉపాధ్యాయుల డిప్యూటేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు.

అవసరంలేని పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలలకు..

జిల్లాలోని అన్నీ మేనేజ్‌మెంట్ల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లో 4,357 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 3,661 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా 696 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిల్లో ఎక్కువగా సబ్జెక్టు టీచర్ పోస్టులే ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అవసరంలేని పాఠశాల నుంచి అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు, మూడు నెలల తర్వాత డిప్యూటేషన్ ప్రక్రియ జరిగేది. రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాలల పునఃప్రారంభం నాటికే డిప్యూటేషన్ పూర్తి చేయనున్నారు. కాగా గతేడాది 280 మందిని డిప్యూటేషన్‌పై పంపగా, చాలా మంది డిప్యూటేషన్‌పై వెళ్లకుండా యథాస్థానంలో పని చేశారు. ఈ సారి అలాంటి పరిస్థితి రాకుండా కలెక్టర్ ఆమోదంతో డిప్యూటేషన్ జరగనుందని జిల్లా విద్యాధికారులు చెబుతున్నారు.

వివరాలు తెప్పిస్తున్నాం



నూతన విద్యా సంవత్సరంలో అవసరం ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఉండేందుకు డిప్యూటేషన్ ప్రక్రియ పనులు జరుగుతున్నాయి. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు వివరాలను తెప్పిస్తున్నాం. అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేస్తాం.– ఇ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాధికారి

'పాలిటెక్నిక్'లో మనోళ్ల ప్రతిభ

ఆరుగురు విద్యార్థులకు ర్యాంకులు



శివభవాని



శశాంక్

కొత్తగూడెంఅర్బన్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల కాగా, జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. పాల్వంచ మండలం జగన్నాథపురానికి చెందిన తిప్పిరెడ్డి మోహన్‌రెడ్డి 30వ ర్యాంకు, ఇల్లెందుకు చెందిన గొల్ల శశాంక్ 77 ర్యాంకు, గౌతంపూర్‌కు చెందిన శ్రీసాయిశివాణి 143వ ర్యాంకు, లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండకు చెందిన కె.శివభవాని 78, చర్లకు చెందిన కాకర్ల నిఖిల్ 209, పాల్వంచ శ్రీనగర్‌కు చెందిన పి.లక్ష్మీచైత్రిక 240 ర్యాంకు సాధించారు. జిల్లా నుంచి ఎంపీసీ విభాగంలో 2,633 మంది, ఎంబైపీసీ విభాగంలో 2,624 మంది పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించారని అధికారులు తెలిపారు.

ఐఐటీకి వెళ్లడమే నా లక్ష్యం..



పాల్వంచరూరల్: మాది పాల్వంచ మండలం జగన్నాథపురం . నాన్న దయాకర్‌రెడ్డి రైతు. వ్యవసాయం చేస్తూ నన్ను ప్రైవేట్ పాఠశాల రెజినా కాన్వెంట్‌లో చదివించాడు. నేను కూడా కష్టపడి చదివా. మంచి ర్యాంకు వచ్చింది. నాకు ఐఐటీలో ఇంజనీరింగ్ చేయాలని ఉంది.

–తిప్పిరెడ్డి మోహన్‌రెడ్డి, 30వ ర్యాంకు

టైలర్ బిడ్డకు 77 ర్యాంకు

ఇల్లెందు: పాలిసెట్‌లో 77వ ర్యాంకు సాధించిన శశాంక్ పట్టణంలోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన గొల్లా శ్రీనివాస్(టైలర్), సంధ్య దంపతుల కుమారుడు. కాకతీయ ఇంగ్లిష్ మీడియంలో చదివిన శశాంక్ పదో తరగతిలో 10 జీపీఏ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ రామచందర్, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రాజేందర్, పులిగళ్ల మాధవరావు, మాజీ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు మడత రమా, వెంకట్‌గౌడ్ అభినందించారు.

అథ్లెటిక్స్‌లో ఐదు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన అథ్లెట్లు ఐదు పతకాలను సాధించినట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా నుంచి 10 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ఒక బంగారు పతకం, నాలుగు కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు. భద్రాచలానికి చెందిన వర్స రాజు 800 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం, కొత్తగూడేనికి చెందిన వంశీకృష్ణ 400 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో రెండు కాంస్య పతకాలు, లాంగ్ జంప్‌లో మణుగూరుకు చెందిన పి.నవ్య, దమ్మపేటకు చెందిన జి.జయ్ రాకేష్ కాంస్య పతకాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ జీవీకే మనోహర్‌రావు, అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ, రాజేందర్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

నర్సరీలను నిరంతరం పర్యవేక్షించాలి



నర్సరీలో పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓ

చుంచుపల్లి: మండల పరిధిలోని చుంచుపల్లితండా గ్రామపంచాయతీలో శుక్రవారం జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వాణాధికారిణి మేరుగు విద్యాలత విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, హరిత నర్సరీ, డంపింగ్ యార్డ్ షెడ్లను పరిశీలించారు. అనంతరం రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కలకు నీళ్లు పట్టారు. వేసవి దృష్ట్యా మొక్కలకు తరుచూ నీళ్లు పడుతూ రక్షించాలని చెప్పారు. నర్సరీల్లో మొక్కలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మంద మంగమ్మ, కార్యదర్శి కుడికాలు సత్యనారాయణ, ఏపీఓ రఘుపతి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న సాబీర్‌పాషా

గుండాల: పీడిత ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం ప్రజల పక్షానే పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా తెలిపారు. శుక్రవారం ఆళ్లపల్లి మండలం మ ర్కొడు గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలను నిలువునా దగా చేస్తున్న మోదీ.. గద్దెదిగే వరకూ పోరాటం తప్పదన్నారు. కర్ణాటక తరహాలో మోదీకి వచ్చే ఎన్నికలే చివరి ఎన్నికలు అవుతాయని హితవు పలికారు. ప్రజాపోరు యాత్ర స్ఫూర్తితో కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించే సీపీఐ జిల్లా కమిటీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి 25 కుటుంబాలు సీపీఐలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆళ్లపల్లి మండల వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, నరేడ్ల రాంబాబు, వజ్జ పగడయ్య, ఎస్‌కె. రహీం, సర్పంచ్ కోటేశ్వరరావు, వార్డు సభ్యులు రేసు సురేందర్, గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, నాయకులు లాజర్, ఇమ్మాన్యుయేల్, కాంతారావు, ముత్తయ్య, శ్రీను, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆసిక్‌కు గురుదేవోభవ అవార్డు



ఆసిక్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్

బూర్గంపాడు: బూర్గంపాడులోని న్యూ సెంచరీ స్కూల్ కరస్పాండెంట్ ఆసిక్ లైక్‌కు అమరావతి నేషనల్ ఒలంపియాడ్ ఫౌండేషన్ గురుదేవోభవ అవార్డును ప్రకటించింది. విద్యాభివృద్ధి కోసం ఆసిక్ చేస్తున్న సేవలు, కృషిని గుర్తించిన ఫౌండేషన్ ఆయనకు ఈ అవార్డును ప్రకటించింది. ఈమేరకు ఆసిక్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసుఫ్, బీఆర్ఎస్ నాయకులు సాబీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ శాఖ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో శుక్రవారం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ శాఖ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు సుమారు 6 కేజీల ఎండు గంజాయిని ఓ వాహనంలో ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా పట్టుబడ్డారు. అనంతరం పట్టుబడిన వ్యక్తులను పోలీసులు విచారించగా.. వారు ఒడిషా రాష్ట్రంలోని మల్కాన్‌గిరికి చెందిన టాపస్ సర్దార్, లక్ష్మీశాగారియాలని తేలింది. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ తనిఖీలో లావణ్య, సంధ్య, రతన్ ప్రసాద్‌రెడ్డి, శ్రవంతి, సత్యనారాయణ, ఇతర పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త!

మైనర్లకు బండి ఇవ్వొద్దు.. ప్రమాదాలకు కారకులు కావొద్దు

- మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసుల నజర్
- ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 79 కేసులకు రూ.39,500 జరిమానా
- తల్లిదండ్రులు, సంరక్షకులకు మూడేళ్లు జైలు శిక్ష
- తీరుమారకపోతే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక



కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

మైనర్ బాలబాలికలకు వాహనాలు ఇచ్చే అలవాటు చాలా మంది తల్లిదండ్రులు, సంరక్షకుల్లో కనిపిస్తుంది. అదే వారిని కొంపముంచుతుంది. బయట చిన్న చిన్న పనులకు ఏం వెళ్తాం.. పిల్లలను పంపుదామని పంపించి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారు. వీటికి అధిగమించడానికే పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. మైనర్లకు బండి ఇచ్చారా.. ఇక జైలుకే అని హెచ్చరిస్తున్నారు. మా పిల్లలు బండి బాగా నడుపుతారు.. బజార్‌కు వెళ్లి రమ్మంటే ఇలావెళ్లి అలా వస్తారని వారి తల్లిదండ్రులు గొప్పలకు పోయి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడొద్దని సూచిస్తున్నారు. మైనర్లకు బండి లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే.. నడిపిన మైనర్‌తో పాటు బండి ఇచ్చిన వారికి శిక్ష తప్పదని హెచ్చరిస్తున్నారు.

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పట్టుబడిన మైనర్లకు జరిమానాతో పాటు జైలుశిక్షలు సైతం విధించినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. జిల్లాలోని 28 పోలీస్ స్టేషన్‌లతో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 79 కేసులు నమోదు కాగా.. రూ.39,500 జరిమానా విధించినట్లు తెలిపారు. అందులో మార్చి నాటికి నమోదైన 56 కేసులకు రూ.28,000 జరిమానా, ఏప్రిల్ 29వ తేదీ నాటికి నమోదైన 23 కేసులకు రూ.11,500లు జరిమానా విధించడంతో పాటు వారి తల్లిదండ్రులు, మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సరదాలకు బండి ఇవ్వొద్దు..

పిల్లలు సరదా పడుతున్నారనీ వారి సంతోషం కోసం మైనర్లకు బండిస్తే పెద్దలకు ఇబ్బందులు తప్పవని పోలీసులు సూచిస్తున్నారు. వేసవి సెలవుల్లో ఎలాగైనా బండి నేర్పించమని, నేర్చుకున్న తర్వాత తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి వాహనాలను నడుపుతూ వారి సరదాను తీర్చుకోవాలన్న కోరికతో కొన్నికొన్ని సార్లు ప్రమాదాలకు గురై వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇలా కాకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని అధికారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఇలా..

- ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే.. రూ. 2 వేలు, ఓలా ఉబర్ క్యాబ్ లాంటి వాహనాలకు రూ.లక్ష వరకు జరిమానా.
- కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోకుంటే రూ.1,000 జరిమానా.
- ఓవర్ లోడింగ్ చేస్తే రూ.20 వేలు జరిమానా.
- లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు.
- మితిమీరిన వేగంతో వెళ్తే రూ.2 వేలు.
- ప్రమాదకరంగా నడిపితే రూ.5 వేలు.
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేలు.
- హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానాతో పాటు మూడు నెలలు లైసెన్స్ రద్దు.
- టూవీలర్ వెనుక వ్యక్తి హెల్మెట్ ధరించకుంటే రూ.వెయ్యి జరిమానా.

నిబంధనలు పాటించని వారికి శిక్షలు..

- 18 ఏళ్ల లోపు బాలబాలికలు బండి నడిపితే శిక్షార్హులు.
- 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ లైసెన్స్‌తో వాహనాలను నడపాలి.
- మైనర్లకు బండి ఇచ్చిన వారికి రూ.25 వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్షతో పాటు లైసెన్స్‌ను రద్దు చేస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం..



పిల్లలు ముచ్చట పడ్డారని తల్లిదండ్రులు ఎవరూ వాహనాలను ఇవ్వొద్దు. అలా చేసి పట్టుబడితే బండి ఇచ్చిన వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించడమే కాకుండా లైసెన్స్ రద్దు చేస్తాం. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ వరకు 79 కేసులకు గాను రూ.39,500 జరిమానా విధించాం. మైనర్లు ఎవరైనా పట్టుబడితే మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ వినీత్, జిల్లా ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం

ఆదివాసీ యువజన క్రీడా ఉత్సవాలు షురూ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సత్యవతి

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివాసీ స్పోర్ట్స్ ఫౌండేషన్, ఆధార్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఆదివాసీ గిరిజన యువజన క్రీడా ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, విలువిద్య, వ్యాయామ క్రీడల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు రావడంతో భద్రాద్రి వేదిక హోరెత్తింది. మొదటి రోజు పోటీల్లో పాల్గొనేందుకు సుమారు 2 వేల మంది క్రీడాకారులు, శిక్షకులు వచ్చినట్లు నిర్వాహకులు మడివి లక్ష్మణరావు, వర్ష నాగేశ్వరరావు తెలిపారు. తొలుత పోటీలను భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, ప్రొఫెసర్ డాక్టర్ సిడం కిషోర్, డాక్టర్ వెంకట్రావులు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సొసైటీ సమన్వయ నాయకులు పోడియం బాలరాజు, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, జయబాబు, కృష్ణ, రవివర్మ, కోచ్‌లు హరికృష్ణ, కృష్ణారావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చలపతిరాజుకు ఎన్టీఆర్ లెజెండరీ అవార్డు



చలపతిరాజు

కొత్తగూడెంఅర్బన్: ఎన్టీఆర్ లెజెండరీ అవార్డుకు జిల్లా సైన్స్ అధికారి సరస్వతీ చలపతిరాజు ఎంపికయ్యారు. ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ (ఎఫ్‌టీపీసీ) ఆఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఉపాధ్యాయ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయ అండ్ సైన్స్ ఆఫీసర్‌గా చలపతిరాజును ఎంపిక చేశారు. ఈ నెల 28న హైదరాబాద్‌లో అవార్డును అందించనున్నారని, వేడుకలకు ఎఫ్‌టీపీసీ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, వర్మ పాకాలపాటి తనకు ఆహ్వానం పంపారని చలపతిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రామాలయ నాదస్వర ఉద్యోగి సస్పెండ్



రామాలయం వ్యూ

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో నాదస్వర ఉద్యోగిగా పనిచేస్తున్న లొడుగు కేశన్న విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాలంలో దేవాదాయ శాఖ పరిధిలో ఉద్యోగుల నిమిత్తం పరీక్షలు, ఇంటర్వ్యూలను రాష్ట్రస్థాయిలో నిర్వహించగా.. పలు దేవాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొంతమంది దళారులు డబ్బులు వసూలు చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. దీంట్లో కేశవ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించగా.. జరిగిన అక్రమాలలో ఇతడి పాత్ర ఉందని అధికారులు గుర్తించారు. దీంతో బ్యాంకు ఖాతాలను పరిశీలించగా.. పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలను నిర్వహించినట్లు అధికారులు గుర్తించినట్లుగా సమాచారం. వీటితో పాటు మరికొన్ని ఆధారాలతో కమిషనర్‌కు నివేదికను అందజేయగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

లడ్డూ టెండర్లకు మూడు దరఖాస్తులు..

రామాలయంలో లడ్డూ ప్రసాదాల తయారీకి ఈ నెల 22వ తేదీన టెండర్లను పిలవగా.. కేవలం ఒకటి మాత్రమే దరఖాస్తు రావడంతో వాయిదా వేశారు. ప్రస్తుతం మూడు దరఖాస్తులు రావడంతో నిబంధనల ప్రకారం.. వీరిలో ఒక్కరికి శనివారం టెండర్‌ను ఖరారు చేసే అవకాశం ఉంది.

అదనపు కౌంటర్ల తొలగింపు..

ఆలయ పరిధిలో నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా, భక్తులకు ఇబ్బందిగా నిర్వహిస్తున్న కౌంటర్లను తొలగించాలని ఆలయ ఈఓ రమాదేవి శుక్రవారం ఆదేశాలను జారీ చేశారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రాజగోపురం వద్ద ఓ సెల్ కౌంటర్‌తో పాటు మరో వస్త్రాల కౌంటర్లను తొలగించాల్సి వచ్చిందని ఈఓ తెలిపారు. కాంట్రాక్టర్లు షరతుల మేరకు మాత్రమే నిర్వహించాలని, లేనిచో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి 'సీఎం కప్'కు ఎంపిక..



బాక్సింగ్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులతో కోచ్ సత్యంబాబు

కొత్తగూడెంటౌన్: సీఎం కప్ క్రీడల్లో భాగంగా ఈ నెల 24 కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన నలుగురు క్రీడాకారులు బాక్సింగ్ విభాగంలో ఎంపికైనట్లు కోచ్ సత్యంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారిలో సాయి ఉదయ్, సాయి రోహిత్, పవన్ కల్యాణ్, భరత్‌లు ఉన్నట్లు కోచ్ తెలిపారు. ఈమేరకు పలువురు క్రీడాకారులు, కోచ్‌లు వారిని అభినందించారు.

బైక్‌ను అపహరించిన బాలుడు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఓ బాలుడు చోరీ చేసిన ఘటన ఇది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ పుల్లయ్య గురువారం ఉదయం విజయవాడ వెళ్తూ బస్టాండ్ ప్రాంగణంలోని కార్గో కేంద్రం ఎదుట ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి వెళ్లాడు. రాత్రి వచ్చేసరికి బైక్ కన్పించకపోవడంతో ఆరా తీశారు. అయితే, మధ్యాహ్నం ఓ బాలుడు వచ్చి తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడని, బండి తాళం పోయిందని కార్గో సిబ్బందికి నమ్మబలికాడు. అనంతరం బాలుడు వైర్లు కత్తిరించి వాహనాన్ని దొంగిలించాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పుల్లయ్య తెలిపారు.

ఎక్సైజ్ వాహనాన్ని అడ్డగించి సారాతో పరారీ..

తిరుమలాయపాలెం: నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు తీసుకెళ్తుండగా ఆయన సోదరుడు వాహనాన్ని అడ్డగించి సారా తో సహా పరారు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బచ్చోడుతండాలో ఎక్సైజ్ సీఐ ప్రసాద్, ఎస్ఐ సరిత, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుగులోతు రవి వద్ద రెండు లీటర్ల నాటుసారా లభించడంతో ఆయనను జీపులో ఎక్కించారు. ఈక్రమంలో రవి తమ్ముడు రాకేష్ జీపుకు అడ్డుతగిలి తన సోదరుడు, నాటుసారా తీసుకుని ఇద్దరూ పరారయ్యారు. ఘటనపై ఎక్సైజ్ అధికారులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఓవర్‌లోడ్‌తో కుప్పకూలిన బొగ్గు టిప్పర్



టైర్లు ఊడి కుప్పకూలిన బొగ్గు టిప్పర్

మణుగూరు రూరల్ : ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఓ బొగ్గు టిప్పర్ టైర్లన్నీ ఒక్కసారిగా ఊడిపోవడంతో కుప్పకూలిపోయింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మణుగూరు ఏరియా పీకేఓసీ, మణుగూరు ఓసీ గనుల నుంచి భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌కు శుక్రవారం ఒక టిప్పర్ బొగ్గు లోడ్‌తో వెళ్తుంది. ఈ క్రమంలో మణుగూరు ఓసీ ప్రధాన రహదారి ప్రాంతానికి వచ్చేసరికి టిప్పర్ వెనుక భాగంలోని నాలుగు టైర్లు ఒక్కసారిగా ఊడడంతో కుప్పకూలింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు. కాగా, టిప్పర్ ఓవర్ లోడ్, అతివేగం వల్ల గతంలో అనేక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈమేరకు సంబంధిత అధికారులు టిప్పర్లు, లారీల అతివేగం, ఓవర్‌లోడ్‌లపై దృష్టి సారించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

28 నుంచి కేంద్ర బృందం పర్యటన

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు కేంద్ర వైద్య బృందం జిల్లాలో పర్యటించనుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ఎంఎల్‌హెచ్‌పీ, పీహెచ్‌సీ వైద్యాధికారులతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర బృందం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలిస్తారని పేర్కొన్నారు.

రామయ్యను దర్శించుకున్న రైల్వే అధికారి



పంచవటి కుటీరం వద్ద కుటుంబంతో గంగూలీ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాలలో శ్రీ సీతారామ చంద్రస్వామిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ రాజీవ్‌కుమార్ గంగూలీ(ఐఆర్ఎస్ఈ) కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలకగా, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆతర్వాత పంచవటి కుటీరం, నార చీరల ప్రాంతాల విశిష్టతను తెలుసుకున్నారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ మేనేజర్ రాజీవ్ నిష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకిన యువకుడి మృతి



సాయి (ఫైల్)

ఇల్లెందురూరల్: బావిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఒడ్డుగూడెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు గోగుల సాయి (17) తన సోదరుడు గతేడాది ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి ముబావంగా ఉంటున్నాడు. అంతేకాక ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షలకు కూడా హాజరకాలేదు. దీంతో గురువారం రాత్రి బావిలో దూకగా.. అనుమానించిన కుటుంబసభ్యులు కొద్దిసేపు బావిలో గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఉదయం స్థానిక ఈతగాళ్ల సాయంతో మరోసారి వెతకగా.. సాయి మృతదేహం బయటపడింది. ఈమేరకు సాయి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు బావి వద్దే పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. ఏడాది వ్యవధిలో ఇద్దరు కుమారులను కోల్పోయిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వడదెబ్బతో వ్యక్తి...

దుమ్ముగూడెం: మండలంలోని పాత బండారిగూడెం గ్రామానికి చెందిన కుంజా శ్రీరాములు(53) వడదెబ్బకు గురై శుక్రవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజులాగే శుక్రవారం శ్రీరాములు పశువుల సంచారం ఎక్కువగా ఉండడంతో తన మిర్చితోట వద్దకు కాపాలకు వెళ్లాడు. ఈ క్రమంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రమాదవశాత్తు లారీ క్లీనర్..

మణుగూరురూరల్: ప్రమాదవశాత్తు లారీ పైనుంచి పడి ఓ లారీ క్లీనర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం శుక్రవారం సాంబాయిగూడెం గ్రామం వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన గుద్దేటి వెంకటరెడ్డి అనే క్లీనర్ యూరియా లోడ్‌తో వెళ్తున్న లారీపై నుంచి కిందపడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో నాలుగు పాడిగేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

చండ్రుగొండ: విద్యుదాఘాతానికి గురై నాలుగు పాడిగేదెలు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని గానుగపాడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇంజం అప్పారావు, ఇంజం పూర్ణమ హేష్‌బాబు, మోగిలిపువ్వు తిరుపతయ్య, ఝిన్నం వెంకన్న అనే రైతులకు చెందిన పాడిగేదెలు శుక్రవారం ఉదయం మేతకు బయలుదేరి వెళ్లాయి. గానుగపాడు–రావికంపాడు గ్రామాల మధ్య గల చేల్లో మేస్తుండగా.. తెగిపడి ఉన్న త్రీఫేస్ విద్యుత్ వైర్లకు తగిలి నాలుగు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.3లక్షలు ఉంటాయని బాధిత రైతులు వాపోతున్నారు. బుధవారం వచ్చిన గాలిదుమారానికి విద్యుత్ తీగలు తెగిపడగా.. రైతులు, విద్యుత్ శాఖ సిబ్బంది గమనించకపోవడం గమనార్హం. ఈనేపథ్యంలో ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారావు మాట్లాడుతూ.. గాలిదుమారాల సమయంలో పంటచేలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండడంతో పాటు తెగిపడిన సమాచారాన్ని విద్యుత్ సిబ్బందికి తెలపాలని సూచించారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గల పలు స్కానింగ్ సెంటర్లను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డెమో ఫయాజ్ మొహిద్దీన్ మాట్లాడుతూ.. డీఎంహెచ్‌ఓ శిరీష ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ బేబీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్య


ప్రొఫెసర్ కనకయ్య

తెయూ(డిచ్‌పల్లి): ఈసీ (పాలకమండలి) నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కనకయ్యను వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్‌గుప్తా నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే కనకయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. వీసీ రవీందర్‌గుప్తా, పాలక మండలి సభ్యులు, రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రొఫెసర్ యాదగిరి తర్వాత తానే సీనియర్‌నని చెప్పారు. బయట యూనివర్సిటీలకు చెందిన వారిని రిజిస్ట్రార్‌గా తెస్తే ఒప్పుకునేది లేదన్నారు. ఇదే విషయాన్ని తాను రెండు నెలలుగా ఈసీ మెంబర్లకు చెప్పడంతో పాటు వారిని వ్యక్తిగతంగా కలిసి విన్నవించానని, కొందరు ఈసీ మెంబర్లు సైతం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారని వివరించారు. వచ్చే నెల 3న జరిగే ఈసీ సమావేశంలో తనను రిజిస్ట్రార్‌గా ఆమోదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన కనకయ్యను పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

అన్యమత ప్రచారం చేయొద్దు

గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు


అన్యమత ప్రచారం చేయొద్దంటూ గోపన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్డు

బిచ్కుంద: తమ గ్రామంలో అన్యమత ప్రచారాన్ని నిషేధించినట్టు కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు చేశారు. 'ప్రచారం చేయవద్దు.. దయచేసి సహకరించండి.. అతిక్రమించి గ్రామంలో మత ప్రచారం చేస్తే తన్ని పోలీసులకు అప్పగిస్తామని'.. బోర్డులో పేర్కొన్నారు. కాగా 20 రోజుల క్రితం పుల్కల్ గ్రామంలో అన్యమత ప్రచారం చేస్తున్నారని కొందరు యువకులు ఓ ఇంటిపైకి వెళ్లి దాడి చేశారు. దీంతో వారిపై అట్రాసిటీ కేసు నమోదైంది. పుల్కల్‌లో జరిగిన ఘటన పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో గోపన్‌పల్లిలో బోర్డు ఏర్పాటు చేసినట్టు గ్రామస్తులు కొందరు తెలిపారు.

ప్రతి నెలా పీఏసీ

- కాంగ్రెస్ ముఖ్య నేతల నిర్ణయం
- పీఏసీలో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలి
- 20 రోజుల పాటు 'దశాబ్ది దగా' పేరిట కార్యక్రమాలు
- టీసీ గర్జనకు సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లకు ఆహ్వానం


కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ముఖ్యనేతలు

సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి ప్రతి నెలా మొదటి వారంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ ముఖ్య నేతలు నిర్ణయించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అంశాలు పీఏసీలో చర్చించాలని, ఆ తర్వాతే నిర్ణయాలు అమలు చేయాలని తీర్మానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మధుయాష్కీ గౌడ్, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్‌జావెద్, సంపత్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీ ఉన్నట్టా లేనట్టా?

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మాణిక్‌రావ్ ఠాక్రే బాధ్యతలు చేపట్టిన తర్వాత పీఏసీ సమావేశాలు నిర్వహించకపోవడంపై చర్చ జరిగింది. తొలినాళ్లలో ఒకసారి మాత్రమే నిర్వహించారని, ఆ తర్వాత ఎలాంటి సమావేశం జరపకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ప్రతి నెలా మొదటి వారంలో పీఏసీ సమావేశం నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా పార్టీ తరఫున నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. 'వచ్చే నెల రెండో తేదీన జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె చిత్రపటాలకు పాలాభిషేకం చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం రోజుకో కార్యక్రమం చొప్పున 20 రోజుల పాటు 'దశాబ్ది దగా' పేరుతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి. గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అదే విధంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో చెప్పాలి..' అని నిర్ణయించారు. ఈ కార్యక్రమాలు జరుగుతున్నన్ని రోజులు పార్టీ శ్రేణులు తమ ఇళ్లపై కాంగ్రెస్ జెండాలు ఎగురవేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

ఇప్పుడు వారికే దోచిపెడుతున్నారు: మధుయాష్కీ

గతంలో ఆంధ్ర వాళ్లు దోచుకుంటున్నారని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు వారికే దోచిపెడుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. ముఖ్య నేతల భేటీ అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వీహెచ్, సంపత్‌కుమార్, నదీమ్ జావెద్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో టీసీ గర్జన ఏర్పాటు చేస్తామని, ఈ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను ఆహ్వానిస్తామని చెప్పారు. పార్లమెంటు నూతన భవన నిర్మాణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలంతా బహిష్కరించనున్నట్టు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హిమాచల్ సీఎం సుఖుపై బీఆర్ఎస్ నేతల విమర్శలను వారి విచక్షణకే వదిలివేస్తున్నామని శ్రీధర్‌బాబు అన్నారు.

త్వరలో సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య.. వందేభారత్

- ప్రస్తుతం ఇరు నగరాల మధ్య 11 గంటల ప్రయాణ సమయం
- వందేభారత్‌తో ఇక ఆరున్నర గంటలే
- మరింత పెరగనున్న వాణిజ్య సంబంధాలు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు త్వరలో మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాబోతోంది. హైదరాబాద్-నాగ్‌పూర్ మధ్య ఈ రైలు ప్రారంభం కానుంది. ఈ సంవత్సరారంభంలో దక్షిణమధ్య రైల్వేకు మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను రైల్వే బోర్డు మంజూరు చేసింది. అందులో తొలి రైలు సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య సంక్రాంతి రోజున ప్రారంభమవగా ఏప్రిల్‌లో సికింద్రాబాద్-తిరుపతి మధ్య రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. మూడో వందేభారత్ రైలు హైదరాబాద్-పుణే మధ్య ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పుడు దానికంటే ముందు నాగ్‌పూర్‌తో అనుసంధానం తెరపైకి వచ్చింది. దీనికి రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ కూడా సానుకూలత వ్యక్తం చేశారు. ఈ రెండు నగరాల మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలను దృష్టిలో పెట్టుకొని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.

తగ్గనున్న ప్రయాణ సమయం..

నాగ్‌పూర్-హైదరాబాద్ మధ్య ఇప్పటివరకు శతాబ్ది, రాజధాని లాంటి ప్రీమియర్ కేటగిరీ రైళ్లు లేవు. సాధారణ రైళ్లు ఆ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగిస్తున్నా ఇరు నగరాల మధ్య 581 కి.మీ. దూరం ఉండటంతో ప్రయాణ సమయం 11 గంటలుగా ఉంటోంది. దీంతో ప్రయాణ సమయాన్ని తగ్గిస్తే వ్యాపార బంధం మరింత దృఢంగా మారుతుందన్న ఉద్దేశంతో మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతానికి చెందిన ఆ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి సుధీర్ ముంగంటివార్ ఇటీవల రైల్వే మంత్రిని కలిసి వందేభారత్ రైలును కోరారు. విదర్భలోని వార్ధా ఎంపీ రామ్‌దాస్ కూడా ఈ మేరకు విన్నవించారు. వాటికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తాత్కాలిక టైంటేబుల్ ఇలా...

ప్రతిపాదిత వందేభారత్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక టైంటేబుల్‌ను అధికారులు రూపొందించారు. దీని ప్రకారం రైలు నాగ్‌పూర్‌లో ఉదయం 6 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12:30కు సికింద్రాబాద్ చేరుకోనుంది. మళ్లీ మధ్యాహ్నం 1:30కు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి 8 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుంది. వారంలో ఆరు రోజులు ఈ రైలు తిరగనుంది. బల్లార్షా, సిర్పూర్, కాగజ్‌నగర్, రామగుండం, కాజీపేటల్లో ఈ రైలుకు తాత్కాలిక స్టాప్‌లను కేటాయించారు. ఎకానమీలో రూ.1,450- రూ.1,550, ఎగ్జిక్యూటివ్‌లో రూ.2,750-రూ.2,850 వరకు చార్జీలను ఖరారు చేసే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వలసల జిల్లాగా మార్చిందే కాంగ్రెస్

- పాలమూరును అభివృద్ధి చేసి ఉంటే తెలంగాణ ఏర్పాటు అవసరమేలేదు
- కాంగ్రెస్ పార్టీపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు జిల్లాను వలసలకు చిరునామాగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయేనని.. అప్పుడు పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసి ఉంటే తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉండేదే కాదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జడ్చర్ల కాంగ్రెస్ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. పాలమూరు జిల్లాలో 14 రోజులకోసారి మంచినీళ్లు వచ్చే పరిస్థితి కాంగ్రెస్ వల్లే దాపురించిందన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకే పాలమూరులో నిత్యం తాగునీరు వస్తోందని, వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలపాటు కరెంట్, రైతులకు పంట పెట్టుబడి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు పథకం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కేవలం రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను కూడా కాంగ్రెస్ పాలనలో పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. సాగు, తాగునీటిని అందించి వలసలు వాపస్ వచ్చేలా చేశామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు స్థానికంగా ఉపాధి అందిస్తున్నామని, అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

పార్ట్-బీతో భూములు ఫట్

గ్రామకంఠం భూముల్లో బీఆర్ఎస్ కబ్జాలు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



బిజినేపల్లి: దేశ విభజన సమయంలో హైదరాబాద్ నుంచి పాకిస్తాన్ వెళ్లిన వారి భూముల సమాచారం సమగ్ర భూ సర్వేతో సేకరించి వాటిని పార్ట్-బీలో చేర్చి విలువైన భూములను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం దోచుకుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. నిజాం పాలకులు సామాజిక అవసరాల కోసం ప్రతి గ్రామంలో కేటాయించిన 30% గ్రామకంఠం భూములను కూడా పార్ట్-బీలో చేర్చి గ్రామాల్లోని బీఆర్ఎస్ పెద్దలు తమకు కావాల్సిన వారి పేరిట ఎక్కించి అమ్ముకుంటున్నారన్నారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం సాయంత్రం తిమ్మాజిపేట మండలంలోని మరికల్ గ్రామం వద్ద నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రవేశించింది. ఈ సందర్భంగా తిమ్మాజిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజధాని ప్రజల దాహార్తి కోసం తీసుకున్న కృష్ణా నీళ్లు ఈ ప్రాంతంలో ఉన్న బీడు భూములకు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇంటింటికి శుద్ధజలం పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టును నిర్వీర్యం చేసి.. ప్రజలకు నీళ్లు అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసి బిడ్డలకు మంచినీళ్లు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఐటీడీఏ ప్రాజెక్టుల ద్వారా తవ్వించిన బావులే ఇప్పటికీ వారి దాహం తీరుస్తున్నాయని పేర్కొన్నారు. కొలువుల కోసం కొట్లాడితే కేసులు పెట్టి ఉద్యోగాలు రాకుండా చేస్తుందన్న భయంతో నిరుద్యోగులు తమ స్వేచ్ఛను కూడా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.


సీపీఎం నాయకుడు సైదులును ఈడ్చేస్తున్న ఎస్ఐ మహేష్

సీపీఎం నాయకుడిని ఈడ్చుకెళ్లిన ఎస్ఐ

- ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని సీపీఎం ఆందోళన
- ఆందోళనకారులను ఈడ్చిపడేసిన ఎస్ఐ

మోతె: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని విభళాపురం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం పలువురు లబ్ధిదారులతో పాటు సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద దారికి అడ్డంగా ముళ్లకంచె వేసి ధర్నా చేశారు. అక్కడికి చేరుకున్న స్థానిక ఎస్ఐ మహేష్ ఆందోళనకారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న జిల్లా సీపీఎం నాయకుడు సైదులును ముళ్లకంచె మీదుగా ఈడ్చేశాడు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఎస్ఐని అడ్డుకునే క్రమంలో వారితో కూడా దురుసుగా ప్రవర్తించారు. ఎస్ఐ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు ఖండించారు.

జిల్లా వార్తలు

'మన ఊరు-మన బడి' డాక్యుమెంటరీ చిత్రీకరణ


కొత్తగూడెం పాఠశాలలో డాక్యుమెంటరీ చిత్రీకరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో 'మన ఊరు-మన బడి' ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలల వివరాలతో డాక్యుమెంటరీని చిత్రీకరించారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి శుక్రవారం జిల్లాకు రాగా, పలు పాఠశాలల్లో పనులను పరిశీలించారు. అనంతరం డాక్యుమెంటరీ చిత్రీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు - మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు సమకూరిన నేపథ్యాన పిల్లలను చేర్పించాలని పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి కోరారు. జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ పంచాయతీ పరిధి ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన ప్రచార కరపత్రాలను ఆర్‌జేడీ శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో అన్ని వసతులు కల్పించడమే కాక నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ జుంకీలాల్, సర్పంచ్ పూనెం నాగేశ్వరరావు, హెచ్ఎంలు లీల, జ్యోతిరాణితో పాటు లగడపాటి రమేష్, ఒట్టికొండ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

29న 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పరిశ్రమలు, సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన ఈనెల 29వ తేదీన 'నిధి ఆప్‌కే నిఖత్' నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీం ఖాన్ తెలిపారు. ఖమ్మం జిల్లా వాసులు సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9-30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

ఉపాధి కూలీలకు అండగా తపాలా శాఖ

- ఇంటి వద్ద, పని ప్రాంతాల్లో వేతనం పొందే అవకాశం
- సేవలకు రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ గ్రీన్ సిగ్నల్
- మారుమూల ప్రాంతాల కూలీలకు ప్రయోజనకరం



ఖమ్మంగాంధీచౌక్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు తెలంగాణ తపాలా శాఖ శుభవార్త చెప్పింది. ఉపాధి హామీ పనులు చేసే వారికి వేతనాలు చెల్లించేందుకు తపాలా శాఖ ముందుకొచ్చింది. దీంతో మారుమూల ప్రాంతాల్లో ఉపాధి కూలీల ఇబ్బందులు తీరనున్నాయి. ఇప్పటి వరకు కూలీలకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా వేతనం చెల్లిస్తోంది. ఈ విధానంలో మారుమూల ప్రాంతాల కూలీలు పైకం కోసం రోజంతా వ్యయ ప్రయాసాలకు ఓర్చి మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈనేపథ్యాన ఇంటి వద్దే కాక పని ప్రదేశాల్లోనూ వేతనాలు చెల్లించేందుకు తపాలా శాఖ ముందుకు రావడంతో ఖమ్మం జిల్లాలో సుమారు 70 వేల మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 80 వేల మందికి పైగా కూలీలకు సేవలు చేరువ కానున్నాయి.

అవగాహన కల్పిస్తూ..

కేంద్రప్రభుత్వం ద్వారా నిర్వహించే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఉపాధి లభిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో చెరువులు, కుంటల అభివృద్ధి, రహదారులు, కాల్వల నిర్మాణం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉపాధి పనులు చేసే కూలీలకు తపాలా శాఖ ద్వారా వేతనాలు పంపిణీ చేయనుండడంతో ఇబ్బందులు తీరనున్నాయి. ఈమేరకు సిబ్బంది కూలీలను కలుస్తూ తపాలా శాఖ ద్వారా అమలయ్యే పథకాలను వివరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విధానం ద్వారా కూలీలను తపాలా శాఖ నిర్వహిస్తున్న ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ)లో ఖాతాదారులుగా చేర్పించి వారి వేతనాలు జమ చేయిస్తారు. తద్వారా కూలీలు తాము ఖాతా కలిగిన సుదూర ప్రాంతాల్లోని బ్యాంకులకు వెళ్లే ఇక్కట్లు తీరుతాయి. నిత్యం అందుబాటులో ఉండే పోస్టాఫీస్ లేదా పోస్టుమ్యాన్ ద్వారా వేతనాలు తీసుకోవచ్చు. అలాగే, బ్యాంక్ ఖాతాల్లో జమ అయినా ఆధార్ అనేబుల్ పేమెంట్ విధానం(ఏఈపీఎస్) ద్వారా తపాలా ఉద్యోగులు పని ప్రాంతాలు, ఇళ్ల వద్ద వేతనాలను చెల్లించేలా చర్యలు చేపట్టింది. ఈ విషయమై తపాలా శాఖను తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అభినందించటంతో పాటు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఉపాధి కూలీలకు ప్రయోజనం



ఖమ్మం డివిజన్‌లో మొత్తం 823 పోస్టాఫీసులు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మారుమూల ప్రాంతాల వరకు ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతాల్లో తపాలా సౌకర్యం అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఉపాధి హామీ కూలీలకు వేతనాలను పని ప్రదేశాలు, ఇళ్ల వద్దే అందించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం.

– బి.రవికుమార్, సూపరింటెండెంట్, ఖమ్మం తపాలా డివిజన్

నాగసాధువుల సాష్టాంగ నమస్కార యాత్ర


సాష్టాంగ నమస్కార యాత్ర చేస్తున్న నాగసాధువులు

చంద్రుగొండ: ఉత్తరాఖండ్‌కు చెందిన నాగసాధువులు చేపట్టిన సాష్టాంగ నమస్కారయాత్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతోంది. లోకకల్యాణార్థం కోసం ఈ యాత్ర చేపట్టామని సాధువులు జిల్లాలోని శుక్రవారం చంద్రుగొండకు వచ్చిన సందర్భంగా తెలిపారు. తమిళనాడులోని రామేశ్వరం వరకు యాత్ర సాగుతుందని దామోదర్‌దాస్ పూజారి వెల్లడించారు. ఇప్పటివరకు 4వేల కిలోమీటర్ల యాత్ర పూర్తయిందని, రోజుకు ఎనిమిది నుండి పది కిలోమీటర్లు వెళ్తున్నట్లు తెలిపారు. కాగా, థర్మకోల్ షీట్ మాదిరి అట్టను జరుపుకుంటూ సాష్టాంగ నమస్కారాలతో ముందుకు సాగుతున్న సాధువులను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

పెద్దమ్మగుడి టెండర్లు వాయిదా

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం - జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద కొబ్బరికాయల దుకాణాల నిర్వహణ, చీరలు పోగు చేసుకునే హక్కు కల్పించే టెండర్లను వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేశారు. ఈమేరకు శుక్రవారం నిర్వహించిన టెండర్, వేలంలో తక్కువ మంది హాజరు కావడం, సరైన పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. దేవాదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణాధికారి పి.బేల్‌సింగ్ ఆధ్వర్యాన వేలం నిర్వహించగా, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, డైరెక్టర్లు కిలారు నాగమల్లేశ్వరరావు, గంధం వెంగళరావు, బేతంశెట్టి విజయ్‌కుమార్, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ ప్రభులత


ఉద్యోగికి నగదు బహుమతి అందజేస్తున్న ఆర్ఎం

భద్రాచలంటౌన్: ఆర్టీసీ ప్రయాణమంటే సురక్షతమై నదనే భరోసా కల్పిస్తూనే ఆదాయ వనరులపై ఉద్యోగులు దృష్టి సారించాలని ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ ప్రభులత సూచించారు. భద్రాచలం డిపోలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను నగదు బహుమతులతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ భద్రాచలం డిపోకు ఆదాయం ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం డిపో రాష్ట్రంలో 13వ స్థానంలో ఉన్నందున మరింత ఆదాయం పెంపునకు కృషి చేయాలన్నారు. ఆతర్వాత ఉద్యోగులకు ఆమె మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డిపో మేనేజర్ బి.రామారావు, ఉద్యోగులు వి.గౌతమి, శ్రీనివాస్, సాహితి, వెంకన్న పాల్గొన్నారు.

రామయ్యకు వెండి పాదుకలు



ఏఈఓకు వెండి పాదుకలను అందచేస్తున్న దాత (ఇన్‌సెట్) వెండి పాదుకలు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామికి ఏపీకి చెందిన భక్తులు శుక్రవారం వెండి పాదుకలను బహూకరించారు. తిరుపతికి చెందిన శ్రీలత రూ.70వేల విలువైన 930 గ్రాముల వెండితో పాదుకలను స్వామికి చేయించారు. వీటికి శుక్రవారం ఆలయంలో పూజలు నిర్వహించాక ఏఈఓ శ్రవణ్‌కుమార్‌కు అందచేశారు. దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

భద్రాచలం: గిరిజన నిరుద్యోగ యువత ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ యువజన శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. పదో తరగతి మొదలు డిగ్రీ, ఆపై కోర్సులు గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు ఐటీడీఏ ద్వారా నిర్వహించే శిక్షణ ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రాణించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈమేరకు జాబ్‌మేళాకు 105 మందికి హాజరుకాగా మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూల ద్వారా 56 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, కంపెనీల ప్రతినిధులు రాజశేఖర్, రాంబాబు, సుహాసిని, నరేష్, గోపాల్, వైటీసీ సిబ్బంది స్వరూప, గీత, సమ్మయ్య, సంపత్ పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీకి టైర్ హాండ్లర్, మొబైల్ సర్వీస్ వ్యాన్


వాహనాలను ప్రారంభిస్తున్న జీఎం రమేష్

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీకి రూ.1.46 కోట్ల విలువైన టైర్ హాండ్లర్ యంత్రం, రూ.36.50 లక్షల విలువైన మొబైల్ సర్వీస్ వ్యాన్‌ను కేటాయించారు. ఆయా వాహనాలను ఏరియా జీఎం జక్కం రమేష్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. డంపర్లు, డోజర్లకు సంబంధించిన అత్యధిక బరువైన టైర్లను మార్చటం కోసం యాజమాన్యం టైర్ హాండ్లింగ్ యంత్రాన్ని కేటాయించిందని తెలిపారు. తద్వారా టైర్ మార్చడం సులువై ఉత్పత్తికి అంతరాయం ఏర్పడదని చెప్పారు. మొబైల్ సర్వీస్ వ్యాన్ ద్వారా క్వారీలో నడిచే వాహనాల నిర్వహణ మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓ ఎస్.వెంకటాచారి, మేనేజర్ వీరయ్యతో పాటు లక్ష్మణమూర్తి, ఉపేంద్రాచారి, పూర్ణచంద్రరావు, దేవదాస్, మనోహర్ పాల్గొన్నారు.